## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బేకరీ షాప్ దగ్ధం

20 లక్షలు ఆస్తి నష్టంతో.. బాధితుడు ఆందోళన



దగ్ధమైన బేకరీ షాపును పరిశీలిస్తున్న జిల్లా ఫైర్ అధికారి

**ధర్మవరం రూరల్ జనవరి 16 ప్రభాతవార్త**

ధర్మవరం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శ్రీ లక్ష్మీ బేకరీ షాపు శుక్రవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో పూర్తిగా దగ్ధమైంది. ఫైర్ ఆఫీసర్ నరసింహులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న బేకరీలో రాత్రి రెండు గంటల సమయంలో పొగలు రావడంతో నైట్ బీట్ పోలీసులు సమాచారం మేరకు అగ్నిమాపక వాహనంతో వెళ్లడం జరిగిందన్నారు. షెట్టర్ తీయకపోవడంతో జెసిబి సహాయంతో వాటిని తొలగించి మా సిబ్బంది ద్వారా మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలిపారు. షాప్ లో ఉన్న ఫ్రిడ్జ్, బేకరీ కి సంబంధించిన యంత్రాలు, వాటి పరికరాలు పూర్తిగా అగ్నికి ఆహుతి కావడం జరిగిందని వివరించారు. సంఘటన స్థలాన్ని జిల్లా ఫైర్ ఆఫీసర్ మాధవ నాయుడు పరిశీలించారు. బాధితుడు అజయ్ బేకరీ షాప్ కు ఇన్సూరెన్స్ కూడా చేయలేదని తెలిపారు. తదుపరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టడం జరిగిందని వారు తెలిపారు. బాధితుడు అజయ్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా నేను బేకరీ షాప్ నడుపుకుంటూ నా కుటుంబాన్ని పోషించుకునే వాడని తెలిపారు. అనుకోకుండా ఈ ఘటన జరగడం వల్ల నేను దాదాపు రూ. 20 లక్షల వరకు నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. కావున నన్ను ప్రభుత్వమే ఆదుకోవాలని తెలిపారు. కూటమి నాయకులు బాధితులని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ముస్తఫా, రవీంద్రనాయక్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అక్కమ్మ ఆలయానికి ప్రహరీ గోడను నిర్మించండి

**కంబదూరు, జనవరి 16, ప్రభాతవార్త**



మీడియాతో మాట్లాడుతున్న రాము

మండల కేంద్రంలోని పురాతనమైన అక్కమ్మ ఆలయానికి ప్రహరీ గోడను నిర్మించాలని బిజేపీ మండల కన్వీనర్ కావేటి రాము ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన స్థానిక యువకులతో కలిసి ఆలయాన్ని పరిశీలించారు. అనంతరం రాము మాట్లాడుతూ పురావస్తు శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అక్కమ్మ ఆలయానికి ప్రహరీ గోడ లేకపోవడంతో కొంతమంది వ్యక్తులు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. మండలానికి కోట్ల రూపాయల నిధులు వస్తున్న ఈ ఆలయాన్ని అధికారులు ఎవరు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. అధికారులు, నాయకులు స్పందించి ఆలయ అభివృద్ధి కోసం పరిరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.

## రైల్వే కార్మికులు ధర్నా



కార్మికులు ధర్నా చేస్తున్న దృశ్యం

**గుత్తి, జనవరి 16 ప్రభాతవార్త**

రైల్వే ఉద్యోగి మృతి పట్ల కారకులపై చర్యలు తీసుకోవాలి దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ఆత్మహత్యకు పాల్పడిన రాజేష్‌కుమార్ మృతికి కారకులైన అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక రైల్వే స్టేషన్ వద్ద శుక్రవారం రైల్వే మజ్దూర్ యూనియన్ డిజల్ లోకో షెడ్ ఆధ్వర్యంలో కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ సీనియర్ సెక్షన్ ఇంజనీరింగ్ అధికారుల వేధింపులు తాళలేక రాజేష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపించారు. కారకులు అయిన అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని, మృతుడి కుటుంబాన్ని యాజమాన్యం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రిస్వామి, అబ్రహం, మనోజ్‌సింగ్, మోహన్‌రావు, పెద్ద సంఖ్యలో డీజిల్ షెడ్ కార్మికులు పాల్గొన్నారు.

## బాటసుంకులమ్మ దేవస్థానంలో టెంకాయలు విక్రయ వేలం



వేలం నిర్వహిస్తున్న దృశ్యం

**గుత్తి, జనవరి 16 ప్రభాతవార్త**

గుత్తి పట్టణ శివారు ప్రాంతంలోని బాచుపల్లి బాట సుంకులమ్మ దేవస్థానంలో టెంకాయలు విక్రయించుకునేందుకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తి మండలంలోని వన్నేదొడ్డి గ్రామానికి చెందిన మద్దయ్య అనే వ్యక్తి 46.30 లక్షలకు వేలం దక్కించుకున్నాడు. గతంలో ఆలయానికి 35.60 లక్షల ఆదాయం రాగా ఈ ఏడాది అదనంగా 11 లక్షల 30 వేల రూపాయలు ఆదాయం సమకూరింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అంబటి నరసింహులు, రంగస్వామి, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అర్బన్ సిఐ రామారావు ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్‌బాబు బందోబస్తు నిర్వహించారు.

## ఘనంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం

**గుత్తి, జనవరి 16 ప్రభాతవార్త**

గుత్తి పట్టణంలో కోట ప్రాంతంలో వెలసిన ప్రాచీన శ్రీలక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల మాలదారణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంపై శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి విగ్రహాలను ఉంచి ఘనంగా ఊరేగించారు. ఆలయం నుండి ఎల్లమ్మ గుడి, చర్చి మీదుగా, గాంధీచౌక్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో మాలదారణ భక్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



## పత్రికా స్వేచ్ఛను కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత

- ఓపీడీఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రాంకుమార్

**గుంతకల్లు, జనవరి 16 ప్రభాతవార్త**

పత్రికా స్వేచ్ఛను కాపాడడం ప్రతి పౌరుడు బాధ్యతగా తీసుకోవాలని ఓపీడీఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, న్యాయవాది నాగరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాకవి కాళోజీ నారాయణరావు చెప్పినట్టుగా ఒక సిరా చుక్క లక్ష మెదుళ్లను కదిలిస్తుందని గుర్తు చేశారు. జర్నలిస్టులు రాసే ప్రతి వార్త లక్షలాది ప్రజల ఆలోచనలను ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం అలాంటి వాటిని అణిచివేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని మండిపడ్డారు. సిద్దిక్ కప్పన్ ఘటన నుండి నేటి ఎన్ టీవీ ఇన్పుట్ విలేకరుల వరకు జరిగిన పరిణామాలే అందుకు కారణమన్నారు. ఆర్టికల్ 19 (1)ఏ ద్వారా లభించిన అభివృద్ధి స్వేచ్ఛను, పత్రికా స్వేచ్ఛను కోల్పోతే ప్రజాస్వామ్యమే ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మీడియా ప్రతినిధులు, విలేకరుల ఇళ్లపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం జాయింట్ సెక్రటరీ తిమ్మప్ప, పలువురు విలేకరులు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి సవిత జన్మదిన వేడుకలు

- ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు,పండ్లు,బ్రెడ్లు పంపిణీ



మంత్రి సవిత జన్మదినం కేక్ కట్ చేస్తున్న దృశ్యం

**పెనుకొండ జనవరి16 (ప్రభాతవార్త)**

బీసీ సంక్షేమ, ఈడబ్ల్యూఎస్, చేనేత-జౌళి శాఖల మంత్రి సవితమ్మ జన్మదిన వేడుకలు పెనుకొండ పట్టణంలోని అన్న క్యాంటీన్ కార్యాలయం నందు అర్బన్ టిడిపి కన్వీనర్ శ్రీరాములు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. పెనుకొండ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం అన్న క్యాంటీన్ నందు అర్బన్ టిడిపి, కూటమి నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న రోగులకు పాలు,పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెదేపా అర్బన్ కన్వీనర్ శ్రీరాములు మాట్లాడుతూ, మంత్రి సవితమ్మ ప్రజాసేవలో ముందుకు వెళ్తూ మరెన్నో విజయాలు సాధించాలని, పెనుకొండ నియోజకవర్గ అభివృద్ధితో పాటు రాష్ట్ర ప్రగతికి ఆమె సేవలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. మంత్రి ఆరోగ్యం, ఆయుష్షు,కీర్తి మరింత పెరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్లు పాలడుగు చంద్రశేఖర్,సిద్దయ్య, నాయకులు సాయి ప్రసాద్,చెండ్రాయుడు,బండా నూర్, సలీం బాషా,కోనాపురం నారాయణస్వామి, ఆర్యవైశ్య సంఘం నాయకులు నంజప్ప,పులుగూర శ్రీనివాసులు,షమూన్, నజీర్, మహమ్మద్,కురబ నంజుండ, కురబ గంగప్ప,ప్రభంజన్ స్వామి, బోయ సోము, ఎస్ రాము,నారాయణ నాయక్, ధోని లక్ష్మీనారాయణ,పోతన్న , అమాన్, గోపాల్, శివా నాయక్,గుట్టూరు శీనా, గోవింద , శంకరా,రవి మరియు తెలుగుదేశం పార్టీ / ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, స్టోర్ డీలర్లు, ఆర్పీలు,పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంక్రాంతి సంబరాలు



ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేస్తున్న దృశ్యం

**ధర్మవరంటౌన్, జనవరి 16 ప్రభాతవార్త**

పట్టణంలో సంక్రాంతి పండుగ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. మూడురోజులపాటు జరిగే సంక్రాంతి వేడుకలు ప్రతి రోజు రంగురంగుల ముగ్గులతో మహిళలు ఆనందంగా పండుగను జరుపుకున్నారు.. సాయి నగర్, పార్థసారధినగర్, రాజేంద్రనగర్, శివానగర్, ఎస్ బీఐ కాలనీ, లక్ష్మీచెన్నకేశవస్వామి. ఇందిరమ్మకాలనీ, తేరుబజారు, యాదవ వీధి తదితర వార్డులలో ఇంటి లోగిళ్ల ముందు ముగ్గులు వేశారు. ఈ ముగ్గులు అందరిని ఆకట్టుకున్నాయి. అదేవిదంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేయించారు.

## గొడవలు వద్దు... ఆనందంగా జీవించండి...!



గ్రామస్తులకు సూచనలిస్తున్న ఎస్ఐ రాజశేఖర్

**ధర్మవరం రూరల్ జనవరి 16, ప్రభాతవార్త**

గొడవల జోలికి వెళ్లి ప్రశాంతమైన జీవితానికి దూరం కాకుండా... మీ పిల్లల బంగారు భవిష్యత్తుకు దోహత పడాలని రూరల్ ఎస్ ఐ రాజశేఖర్ పేర్కొన్నారు . ఈ సందర్భంగా మండల పరిధిలోని వెంకట తిమ్మాపురం గ్రామం లో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ.. మద్యానికి, పేకాటకు దూరంగా ఉండాలని మహిళల పట్ల గౌరవంగా ఉండాలని స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలని ఇంటి నివాసాల వద్ద సీసీ కెమెరాలు బిగించుకోవాలన్నారు. గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకోకుండా ఆనందమైన జీవితం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. దీంతో కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవించవచ్చునన్నారు. మధ్య పెట్టే మాటలు వినడం గ్రామాల్లో కలిసిమెలిసి సఖ్యతగా మెలగాలని ఆయన కోరారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసులదృష్టికి తీసుకురావాలని ఎస్సై తెలిపారు.

## నేడు శ్రీకృష్ణ దేవరాయల జయంతి వేడుకలు

**రామగిరి, జనవరి 16 ప్రభాతవార్త**

మండలంలోని పేరూరు గ్రామంలో శ్రీకృష్ణదేవరాయల 550వ జయంతిని నిర్వహించనున్నట్లు బలిజ సంఘం నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. మొదట శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం అనంతరం గ్రామంలో ఊరేగించడం జరుగుతుందన్నారు. అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. బలిజసోదరులందరూ తప్పక హాజరు కావాలన్నారు.

## ప్రయాణికుల సౌకర్యాల పై దృష్టి

రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా




డోన్ రైల్వే స్టేషన్ ను తనిఖీ చేసిన డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా

**గుంతకల్ రైల్వే జనవరి 16, ప్రభాతవార్త**

గుంతకల్ రైల్వే డివిజన్లోని గుంటకల్-పాణ్యం విభాగంలోని స్టేషన్లు మరియు లెవల్ క్రాసింగ్ (ఎల్సీ) గేట్లను డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్ర శేఖర్ గుప్తా తనిఖీ చేశారు. మరియు డోన్ రైల్వే స్టేషన్ ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భద్రతా అంశాలు, నిర్వహణ ప్రమాణాలు, ప్రయాణికుల సౌకర్యాలను పరిశీలించారు. కార్యకలాపాల సామర్థం మెరుగుపడేందుకు మరియు భద్రతను నిర్ధారించేందుకు సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు జారీ చేశారు. ఈ తనిఖీలో అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ సుధాకర్ తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వెంకటంపల్లిలో వాలీబాల్ పోటీలు



విజేతలకు బహుమతి అందజేస్తున్న టిడిపి నాయకులు

**వజ్రకరూరు జనవరి 16 ప్రభాతవార్త**

మండలం వెంకటాంపల్లి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గురువారం గ్రామస్తుల ఆధ్వర్యంలో పయ్యావుల వెంకట నారాయణప్ప, ఓబులమ్మ అశీస్సులతో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతగా నిలిచిన పామిడి జట్టుకు 20వేల రూపాయలు,రన్నర్ గా నిలిచిన ఎన్ఎన్ పీ తాండ జట్టుకు పదివేల రూపాయలను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, ఎర్రిస్వామి,శ్రీనివాస్ శేఖర్,ఓబులేసు, అర్జున్, రమేష్, వీరా తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రబండలో ఘనంగా సంక్రాంతి వేడుకలు



రిటైర్డ్ ఎస్సై రాజేంద్రనాయక్ ను సన్మానిస్తున్న దృశ్యం

**కంబదూరు, జనవరి 16, ప్రభాతవార్త**

కంబదూరు మండలం ఎర్రబండ గ్రామంలో గురువారం సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఎస్సై తిమ్మాపురం రాజేంద్ర నాయక్, ఎస్సై రామాంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో ముగ్గుల పోటీలు, కబడ్డీ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల వారికి రిటైర్డ్ ఎస్సై రాజేంద్ర నాయక్ రూ. ఒక్కొక్కరికి రూ .1000 నగదును బహుకరించిచారు. గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణం కోసం తోడ్పాటు అందించిన రిటైర్డ్ ఎస్సై రాజేంద్ర నాయక్, ఎస్సై రామాంజినేయులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు . అనంతరం వారు మాట్లాడుతూ పేద పిల్లలకు చదువే ఆస్తి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎరుకుల వెంకటేశులు, వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి పద్మజ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకుడికి ఘనంగా నివాళులు

**అమరాపురం జనవరి 16 ప్రభాతవార్త**



నివాళులర్పిస్తున్న టిడిపి నాయకుల దృశ్యం

అమరాపురం మండలం వలస గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గొల్ల గోపాలప్ప మరియు గాజుల తిమ్మరాయప్ప లు అనారోగ్యంతో శుక్రవారం మరణించడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు వారి భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇందులో అమరాపురం మండల సింగల్ విండో ప్రెసిడెంట్ ఎన్.గణేష్ మాజీ టిడిపి కన్వీనర్ శివ రుద్రప్ప,టీ ఎన్ టి యు సి కార్యదర్శి మంజునాథ్ ,,వలస పంచాయతీ కన్వీనర్ బి ఎస్ నాగరాజు, మాజీ సర్పంచ్ రాధాకృష్ణ,నిరంజన్,,జి ఆర్ చలప్ప, గోపాలకృష్ణ మరియు సీనియర్ నాయకులు పాల్గొనీ పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా గాజుల తిమ్మారాయప్ప కుటుంబ సభ్యులు నాగభూషణ్ ,తిప్పేస్వామి,బాబులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం



అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించిన మాజీ మండల కన్వీనర్

**డి.హిరెహాళ్ జనవరి 16 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ మాజీ మండలం కన్వీనర్ మాకాశి వెంకటేశులు మలపనగుడి తెదేపా కార్యకర్త బోయ ఆంజనేయులు (23) మృతికి సంతాపం తెలిపి అంత్యక్రియలకు ఆర్థిక సహాయం చేశారు. గురువారం డి.హిరెహాళ్ మండలం బలపడం గుడి గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు దురగయ్య కుమారుడు బోయ ఆంజనేయులు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మండల కన్వీనర్ తెలుగుదేశం పార్టీ నాయకులు వడ్డే మారెన్న, మకాశి జయరాములు, రామకృష్ణ, మాకాశి బసవరాజు తదితరులతో కలిసి మృతుడి కుటుంబ సభ్యులను కలుసుకొని సంతాపం తెలిపి అంత్యక్రియలకు రూ. 10 వేలు మృతుడి తండికి అందజేశారు.

## చౌడేశ్వరి జ్యోతుల మహోత్సవంలో ప్రముఖుల సందడి



ఉరగాద్రి చౌడేశ్వరి దేవిను సందర్శించుకొంటున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



కోట చౌడేశ్వరి అమ్మవారిని దర్శించుకొంటున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, డీసీసీ అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి

**ఉరవకొండ, జనవరి 16 ప్రభాతవార్త**

పట్టణంలో సంక్రాంతి పండుగ సందర్భంగా జరిగిన చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల మహోత్సవంలో ప్రముఖుల సందడి కనిపించింది. గురువారం ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మాజీ మంత్రి నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు వై.మధుసూదన్‌రెడ్డి, ఏడీసీసీ బ్యాంకు మాజీ ఛైర్మెన్ లింగాల శివశంకర్‌రెడ్డి, యువనేత వై.నిఖిల్‌రెడ్డి మాతృమూర్తి సుధమ్మ, సతీమణి తదితరులు పాల్గొన్నారు. ఉరగాద్రి చౌడేశ్వరి, కోట చౌడేశ్వరి, పురమానుకట్ట చౌడేశ్వరి తదితర ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఆయా ఆలయాల కమిటీలు శాలువాలుకప్పి పూలమాలలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందించారు.

## సాంప్రదాయబద్ధంగా సంక్రాంతి, కనుమ పండుగలు

-భక్తులు, పర్యాటకులతో కిటకిటలాడిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు




ఇంటి ముందర ముగ్గులు వేస్తున్న మహిళల దృశ్యాలు

**ఉరవకొండ, జనవరి 16 ప్రభాతవార్త**

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గురు, శుక్రవారాలో సంక్రాంతి, కనుమ పండుగలు సాంప్రదాయబద్ధంగా జరిగాయి. సంక్రాంతి పండుగ రోజు మహిళలు ఇంటి ముందర రంగు రంగుల ముగ్గులు వేసి అతికష్టంమీద పేడను సేకరించుకొని వాటితో తయారు చేసిన గొబ్బెమ్మలు ఉంచి పూజలు నిర్వహించారు. కనుమ పండుగ రోజు రైతులు ఇండ్లలోని ఎద్దులు, ఆవులు తదితర వాటికి పూజలు నిర్వహించారు. పండుగ సందర్భంగా పిల్లలు, పెద్దలు రంగు రంగుల గాలిపటాలు ఎగురవేశారు. కాగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మండల పరిధిలోని పెన్నహోబిళంలోని లక్ష్మినరసింహస్వామి, ఉద్భవలక్ష్మి, బూదగవిలోని సూర్యనారాయణస్వామి ఆలయాలతో పాటు మండలంలోని ఇతర దేవాలయాల్లోను ప్రత్యేక పూజలు, అభిషేక కార్యక్రమాలు జరిగాయి. మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దగా వందలాది మంది భక్తులు దేవాలయాలను దర్శించుకున్నారు.

## పందెం రాయుళ్లు గుట్టు రట్టు

**అరుమంది అరెస్ట్ ఐదు ద్విచక్ర వాహనాలు ఒక పందెం కోడి స్వాధీనం**

**శెట్టూరు;డిసెంబర్16 ప్రభాతవార్త**

మండల పరిధిలోని పెద్దబలపంపల్లి గ్రామ శివారాల్లో శుక్రవారం మధ్యాహ్నం 02:00గంటల సమయంలో కోడిపందెం ఆడుతున్న ఆరు మంది వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు యస్.ఐ.సుమన్ తెలిపారు అంతే కాకుండా వారి వద్దనుండి ఒక పందెంకోడి ఐదుద్విచక్ర వాహనాలు 3000/ రూపాయలు నగదును స్వాధీనం చేసుకొన్నారు యస్.ఐ.సుమన్ కు ఉన్నసమాచారం మేరకు జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశానుసారం డిఎస్పీ రవిబాబు,సీ.ఐ.నీలకంటేశ్వర్ పర్యవేక్షణలో యస్ఐ తమ సిబ్బందితో దాడిచేసి పందెం రాయుళ్ల గుట్టును రట్టుచేసి వారిపై కేసు నమోదు చేసినట్లు యస్.ఐ.సుమన్ తెలిపారు.

## బాలయ్య ప్రీమియం క్రికెట్ లీగ్ వెంకటాపురం జట్టు కైవసం



గెలుపొందిన జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

**లేపాక్షి, జనవరి 16 ప్రభాతవార్త**

లేపాక్షి మండల పరిధిలోని సి.వెంకటాపురం గ్రామంలో ఈనెల 8 నుండి 15వ తేదీ వరకు బాలయ్య ప్రీమియం క్రికెట్ లీగ్ క్రికెట్ పోటీలు మండల టిడిపి కన్వీనర్ అభిలాష ఆధ్వర్యంలో జరిగాయి. ఫైనల్ మ్యాచ్‌లో వెంకటాపురం, నాగేపల్లి జట్లు తలపడ్డాయి. నాగేపల్లి జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించింది. 14 ఓవర్లలో 81 పరుగులకు నాగేపల్లి జట్టు ఆలౌట్ అయింది. వెంకటాపురం జట్టు ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ సందర్భంగా గురువారం జరిగిన కార్యక్రమంలో ప్రీమియర్ క్రికెట్ విన్నర్ వెంకటాపురం జట్టుకు మెమొంటోతో పాటు 20 వేల నగదు బహుమతిని అందజేశారు. రన్నర్స్ జట్టుకు మెమొంటోతో పాటు 10 వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ అభిలాష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఇలాంటి క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈశ్వరుడికి శివమాలదారులు ప్రత్యేక పూజలు

**గుడిబండ జనవరి 16 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో శివమాలదారులతో కలిసి రొళ్ళ ఎపిఎం నాగరాజు ఈశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శివమాలదారులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే పరమేశ్వరుడు కి ప్రత్యేక అలంకరణలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ ం ం జు నా ధ్:- , గోవిందరాజు, రంగనాథ్, నవీన, నాగ, రాజు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

